యూనిట్ III

# 11. ప్రాచీన సాహిత్యాధ్యయనం-ఆవశ్యకత

- డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

ఉగాది పండగనాడు పంచాంగశ్రవణంతోపాటు, కవి సమ్మేళనం, సాహిత్య సభ జరుగుతున్నాయి. వేదికమీద ముఖ్య అతిథిగా వచ్చిన ప్రముఖ భాషావేత్త ఈ విధంగా ప్రసంగిస్తున్నారు.

"మానవుడి సాంఘిక జీవనం చాలా వేగవంతమయింది. భవిష్యత్తును అందుకోవాలనే పరుగులో వర్తమానాన్నే వదిలేస్తున్నాం. ఇక గతం గూర్చి ఆలోచించే ఓపిక ఎవరికుంటుంది? కానీ, ప్రస్తుత స్థితి, గత చరిత్రలో పొందిన అనుభవసారం నుంచే మనకు లభించిందనే సత్యాన్ని మరచిపోకూడదు ............... ఇలా సాగింది ఆయన ప్రసంగం.

### ప్రశ్నలు

1. పై సన్నివేశంలో సభ ఎందుకు జరుగుతోంది?
2. ముఖ్య అతిథి దేన్ని గురించి ప్రసంగిస్తున్నారు?
3. ఆయన తన ప్రసంగాన్ని ఇంకా ఎలా పొడిగించి ఉంటాడో చెప్పండి.

### ఉద్దేశం

భిన్నత్వంలో ఏకత్వంతో అలరారుతున్న భారతదేశ ప్రజలను ఉన్నత స్థానంలో నిలబెడుతున్నది పురాణేతిహాస సాహిత్యం. భారతీయ సంస్కృతిలో సాహిత్యానికి గల ప్రాధాన్యతను ప్రాచీనసాహిత్యాన్ని చదవడం వల్ల కలిగే ప్రయోజనాన్ని తెలియ చెప్పడం, ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠం డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి గారు రచించిన 'ఇరివెంటి వ్యాసాలు' లోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. పదపట్టిక చూసి తెలియని పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాలు గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

© SCERT not to be republished

ఆసేతుశీతాచలం వ్యాపించి ఉన్న భారతదేశం అతి ప్రాచీనమైనది. ఈ సువిశాలమైన దేశంలో అనేక భాషలు, అనేక ఆచారవ్యవహారాలు, అనేక జాతులు తమ తమ విశిష్టలక్షణాలతో విలసిల్లుతూ ఉన్నవి. ఇంత అనంతమైన వైవిధ్యం ప్రపంచంలో మరేదేశంలోనూ లేదనడానికి సందేహించవలసిన అవసరం లేదు. అయితే ఈ వైవిధ్యాన్ని ఒక అంతస్సూత్రం బంధిస్తున్నది. అదే భారతీయ సంస్కృతి. అలనాడెప్పుడో ఈ దేశంలో చప్పన్న (56) రాజ్యాలుండేవట. అన్నీ స్వతంత్రరాజ్యాలే. సర్వసత్తాకమైన అధికారము కలిగినట్టివే కాని, సాంస్కృతికంగా భారతీయ ప్రజలను ఈ 56 ప్రభుత్వాలు విడగొట్టలేక పోయినవి. ఈనాడు కూడా ఏ బుద్ధిమంతుడైన భారతీయుడు కూడా తనది ఫలానా రాష్ట్రమని గర్వపడడు. తన ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా కలశస్థాపన చేసి, తన ఊరిలో దొరికిన నీళ్ళనే ఆ కలశంలో పోసి సర్వభారత పవిత్ర నదులన్నీ తన సన్నిధిలో ఉన్నాయని భావించి భక్తితో నమస్కరిస్తాడు. జంబూద్వీపంలో, భరతఖండంలో, మేరువుకు దక్షిణంలో శ్రీశైలానికీ లేక హిమాలయాలకు ఏ దిక్కున ఉన్నాడో ఏ పవిత్ర నదీమతల్లుల నడుమ తాను ఉన్నాడో చెప్పుకొని పూజకు ఉపక్రమిస్తాడు. అంతేకాని, తనది కాశ్మీరమనీ, కేరళమనీ, ఓఢ్రమనీ, తెలుగునాడనీ, తమిళనాడనీ చెప్పుకోడు. ఇలా చెప్పుకోవడం రాజకీయ వేదికల వరకే సరిపెట్టుకుంటాడు. తన సాంస్కృతిక జీవితంలో రాజకీయ విభజనలకు అతడు తావిచ్చుకోలేదు.

సాంస్కృతికంగా భారతీయులనందరినీ ఒకటి చేసింది పురాభారత సాహితి. వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసాది మహాకవులు ఈ దేశ ప్రజలకు ఆలోచనా ఫణితినీ, జీవిత విధానాన్ని, జీవిత లక్ష్యాన్నీ ప్రసాదించిన మనీషివతంసులు. ఈ మహితాత్ములు సంస్కృతంలో రచించిన గ్రంథాలన్నీ భారతీయ భాషల్లోకి కావ్యాలుగా, నాటకాలుగా, కథలుగా, సామెతలుగా, పదబంధాలుగా, జానపద కళారీతులుగా రూపుదిద్దుకున్నవి. ఈ కావ్యాల పాత్రల పేర్లతో నగరాలూ, గ్రామాలు వెలిసినవి. బిరుదులు వెలిసినవి. ఆర్షసంప్రదాయానికి ఎత్తిన వైజయంతికలీ మహాకావ్యాలు. భారతదేశ భౌగోళిక సౌందర్యం, భారతీయుల జీవితవృత్తం, వారి ధర్మాభిరతి, లౌకిక పారలౌకిక, జీవితాదర్శాలు, మానవ జీవిత సాఫల్యానికి దోహదంచేసే అపార





© SCERT not to be republished

శాస్త్రపరిజ్ఞానం, రాజనీతి, అర్థనీతి ఒకటేమిటి అన్నీ వాల్మీకి వ్యాసకృత రామాయణ భారతాది ఇతిహాస పురాణాలలో నిక్షిప్తములై ఉన్నవి. ఇప్పటికీ యావత్ప్రపంచ ప్రజలకూ అతిప్రీతిపాత్రమైన మానవత్వపు విలువలను ఈ మహాగ్రంథాలు అందిస్తూ ఉన్నవి. పేదలూ, ధనికులూ, అబలలూ, సబలలూ, పశుపక్ష్యాదులు, తరులతాగుల్మాదులు యక్షరాక్షస గంధర్వ విద్యాధరులు, ఆటవికులూ, నాగరికులు, నదులూ, కొండలూ, లోయలు, మునులు, మాయావులు, దయాళులు, పదునాల్గులోకాలూ, పదునాల్గు విద్యలూ, అరువైనాల్గు కళలూ అన్నీ తమ తమ జాడలను చూసుకుంటాయి ఈ పురాణ వాఙ్మయ దర్పణంలో.

రామాయణం, మహాభారతం, పదునెన్మిది పురాణాలూ, కథాసరిత్సాగరం అనే పుస్తకాలను సాధ్యమైనంత విపులంగా చదువుకోవలసిన అగత్యం ఎంతైనా ఉన్నది. ఏ శాస్త్రాన్ని అభ్యసించినాసరే ఏ వృత్తితో పొట్టపోసుకున్నా సరే ఏ పదవిని చేపట్టినా సరే – ఈ పుస్తకాలను తప్పకుండా చదవాలి. "ఇవి సంస్కృతంలో ఉన్నవి కదా! నాకు సంస్కృతం రాదు కదా!" అని తూష్ణీంభావాన్ని చూపనక్కరలేదు. తెలుగులో ఈ పుస్తకాలన్నీ దొరుకుతాయి. తెలుగులోనే చదివి సంస్కృతంలో చదివినంత రసానుభూతినీ, విజ్ఞానాన్నీ, పుణ్యాన్ని పొందవచ్చు. భారతీయులలో పలువురికి సంస్కృతం రానే రాదు. సంస్కృతంలో వ్యాస కాళిదాసాదులు వ్రాసిన పుస్తకాలను చదవనేలేరు. చదివినవారు అరుదే! అయినా ఏ ప్రాంతీయ భాషాకవి సర్వ భారతీయులకూ కవి కాలేకపోయినాడు. సంస్కృతభాషతో పరిచయం లేకపోయినా భారతీయులందరికీ వ్యాసుడు కవి, కాళిదాసు కవి, భవభూతి కవి. ఇది ఒక అమోఘమైన, అనిర్వచనీయమైన భారతీయ సంస్కృతి రహస్యం.

స్వాతంత్ర్య సమరయోధుడూ, దేశభక్తుడూ, మహామనీషి చక్రవర్తుల రాజగోపాలాచార్యులు గారు భారతాత్మను అర్థం చేసుకోవాలంటే రామాయణ భారతాలను చదివి తీరవలసిందేనని సందేశమిచ్చినారు.

నవభారత నిర్మాత జవాహర్‌లాల్ నెహ్రూ తన "డిస్కవరీ ఆఫ్ ఇండియా"లో మహాభారత రామాయణాలను గూర్చి వ్రాస్తూ అవి భారతీయ సంప్రదాయ విజ్ఞాన సర్వస్వాలనీ, భారతీయులను ఏకసూత్రంతో కలిపే సందేశ కావ్యాలనీ, భారతీయుల తత్త్వచింతనకూ, భారతీయుల బహుముఖ భావ విజ్ఞానానికీ ప్రతీకలనీ ఉగ్గడించినాడు. పండిత నెహ్రూయేకాదు, భారతీయ స్వాతంత్ర్య సమరంలో మహోత్సాహ ఆవేశాలతో పాల్గొని తమ త్యాగనిరతితో, వినిర్మల జీవిత వృత్తంతో భారత ప్రజాహృదయాలను పునీతం చేసిన మహానుభావులందరూ రామాయణభారతాది ప్రాచీన భారతీయ సాహిత్యంతో ఉద్దీప్తులైనవారే. గాంధీ మహాత్ముడు "గీత నా తల్లి" అని భగవద్గీత పట్ల తన శ్రద్ధాభిమానాలను ప్రకటించినాడు.

మన భారతీయ ప్రాచీన సాహిత్యంతో పరిచయం లేకపోతే భారతీయ భాషలలో దాదాపు రెండు వేల ఏండ్ల నుంచి వెలువడిన సాహిత్యాన్ని తలస్పర్శిగా అవగాహన చేసుకోలేము. మన దివ్య క్షేత్రాల సంగతి తెలియరాదు. మన పుణ్య తీర్థాల మాహాత్మ్యం అవగతం కాదు. కొన్ని పదబంధాలకు, కొన్ని జాతీయాలకు, కొన్ని ఉపమాద్రవ్యాలకు, కొన్ని కథలకు, కొన్ని పొడుపు కథలకు వెనుక ఉన్న ఆంతర్యం స్పష్టంగా ప్రత్యక్షంగాదు. మన తెలుగులో ఇప్పటి దినపత్రికలలో అత్యాధునిక కవితల్లో, నవలల్లో, కథల్లో, నాటికల్లో, కార్టూనుల్లో, జనవ్యవహారంలో 'కబంధహస్తాలు', "పరశురామ ప్రీతి", "చుప్పనాతి", "హనుమంతుని తోక", "రామబాణం" "విశ్వామిత్రసృష్టి", "భగీరథ ప్రయత్నం", "బలి", "నైవేద్యం", "యజ్ఞం", "సర్పయాగం", "మారణహోమం", "స్వర్గం – నరకం", 'రావణాసురుని కాష్ఠం', 'చిదంబర రహస్యం', "లక్ష్మణరేఖ", "హిరణ్యాక్షవరాలు", "నల భీమపాకం". "భీష్మ ప్రతిజ్ఞ", "కుబేర సంపత్తి", "ఇంద్రభవనం", "లక్ష్మీపుత్రుడు", "దేవేంద్ర పదవి", "పుష్పక విమానం", "ఘోషయాత్ర", "ధర్మరాజు" వంటి మాటలు చిమ్మే అర్థాన్ని పురాణాలు తెలియకపోతే పట్టుకునేది ఎలా

© SCERT not to be republished

సాధ్యం? నిన్నటి తరంలో నిరక్షరాస్యులు అధికంగానే ఉన్నా, హరికథా పురాణ కాలక్షేపాలవల్ల అందరికీ వీటి సంగతి తెలియవచ్చేది. ఇప్పుడీ వ్యాసంగాలు సకృతుగానే జరుగుతున్నవి. పండుగలూ పబ్బాలూ జరిగే సందర్భంగా ఏవో కొన్ని ధర్మాలు తెలిసొచ్చేవి. ఇప్పటి యాంత్రిక, కేవల రాజకీయ జీవితంలో అవీ కరువై పోయినవి. రసానుభూతికీ, ధర్మనిరతికీ, సమైక్య జీవితానికీ మార్గదర్శకమైన సంప్రదాయం క్రమంగా నశించిపోతున్నది. భారతీయులకు ప్రపంచంలో నిన్న ఉన్న విశిష్ట స్థానం ఈ వేళ లేకుండాపోతున్నది. మానవుడు పశువుగా పుట్టి క్రమంగా పరిణామం చెందుతూ మానవుడైనాడని



పాశ్చాత్యుల్లో పలువురు నమ్మితే మానవుడు దైవాంశ సంభూతుడని భారతీయులు నమ్ముతున్నారు. ఈ విశిష్టమైన ఆలోచనా ఫణితిని మనం కాపాడుకోవలసి ఉన్నది. ప్రాచీన సాహిత్యాధ్యయనం అంటే తిరోగమనం కాదు. ప్రాచీనులు ఏ విలువకోసం బ్రతుకును మలచుకున్నారో ఆ విలువలు నేటికాలంలో ఎంతవరకు సమంజసమైనదో? అని పరిశీలిస్తే, వారు సార్వకాలీనమూ, సార్వజనీనమూ అయిన విలువలకోసం తపస్సు చేసినారని నమ్మవలసి వస్తుంది.

వాల్మీకి, వ్యాసుడు తమ రచనల్లో భారతదేశంపట్ల అనంతమైన ప్రేమను పెంచుకొమ్మని దేశాన్ని పూజించమని దేశం పుణ్యభూమి అనీ కర్మభూమి అనీ దేశంకోసం త్యాగం చెయ్యాలనీ ఉద్బోధించారు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అన్న అభియుక్తోక్తిని ప్రసాదిస్తున్న పురాణ వాఙ్మయం పాతదా? కొత్తదా? నిత్యనూతనమైనదా? యుగోచితాగ్రగామిత్వానికి ప్రేరేపిస్తున్నదా? ఈ ప్రశ్నలకు సమాధానం లోతైన అధ్యయనంవల్లనే లభిస్తుంది. ఉత్తమ సాహిత్యానికి పాతకొత్తల వింగడింపులు పులమకపోతే కనిపిస్తుంది. వ్యాసుడు భాగవతంలో –

"కల్పాయుషాం స్థానజయాత్ పునర్భవాత్ క్షణాయుషాం భారతభూజవరః
క్షణేన మర్త్యేన కృతం మనస్వినః సంన్యస్య సంయాన్త్యభయం పదం హరేః"

అన్న శ్లోకంలో ఒక కల్పకాలం స్వర్గంలో ఉండి సౌఖ్యం అనుభవించిన దాని కంటే కొంతకాలమైనాసరే భారతదేశంలో బ్రతుకగలిగితే చాలునని హితబోధ చేసినాడు. దేశ ప్రేమ గొప్ప ఆదర్శం. దేశాన్ని ప్రేమించేవాడు అవినీతిపరుడు కాజాలడు. దురహంకారి కాజాలడు. నిన్నటితరంలోని దేశభక్తులందరికీ పురాణ వాఙ్మయం మీద భక్తివిశ్వాసాలు ఎక్కువేనని మనకు తెలుసు. దేశాన్ని ప్రేమించేవాడికి అధికారం లభిస్తే దేశం వెలుగుబాటల్లో పయనిస్తుంది. తాను, తన కులం, తన కుటుంబం, తన కీర్తి, తన లాభం అని అహరహం ఆరాటపడుతూ ఉండేవాడు దేశానికి ఏమీ చెయ్యలేడు. పురాణేతిహాస పఠనంవల్ల కలిగే సంస్కారం మనిషిలో దైవగుణాలను సృజిస్తుంది. స్వార్థచింతనను నశింప చేస్తుంది.

కాశీ విశ్వనాథుని దర్శించి అక్కడ నుంచి తెచ్చిన గంగతో సేతురామేశ్వరునికి అభిషేకం చేస్తే యాత్రాఫలం దక్కుతుందని ధర్మజ్ఞుల ఉపదేశం. యాత్రానెపంతో దేశాన్ని సందర్శించే అవకాశం కల్పించినారు పురాణ కర్తలు. తీర్థాభిగమనానికి క్షేత్రసందర్శనానికి ఏ విధమైన ఆంక్షలు లేవు. అన్ని ఆశ్రమాలవారు అన్ని వర్ణాలవారు యాత్రలు చెయ్యవలసినవారే. యాత్రలవల్ల తన దేశాన్ని చూడవచ్చు. తరించవచ్చు. విజ్ఞానాన్ని సంపాదించవచ్చు.

పురాణేతిహాసాలలో మన గతచరిత్ర దాగివుంది. మన నిన్నటి అనుభవాలున్నవి, నిన్నటి కన్నీరు ఉంది, పన్నీరు ఉంది. మానవుడు తన జీవితాన్ని రసాత్మకంగా ప్రవర్తింపజేసుకోవడంలో చూపిన చొరవ ఉన్నది. పాశవిక ప్రవృత్తులపై అతడు సాధించిన విజయ పరంపరలున్నవి. అతడు మానవుడై పుట్టినా దేవతత్వాన్ని సాధించాలనే తపన ఉన్నది. కనుకనే పురాణేతిహాసాలోని కథలూ, ధర్మాలు సుందర శిల్పసృష్టికి రసనిర్భర కావ్యనిర్మాణానికి ప్రేరకములైనవి.

ఆర్షధర్మాన్ని ప్రబోధించే గ్రంథాలే వేదాలు. కాని వాటిలో ఆ ధర్మాలు నిగూఢంగా, ప్రతీకాత్మకంగా, బీజాక్షర శక్తి ప్రయుక్తంగా, లౌకికేతర సంస్కృతభాషా విరచితంగా ఉండడంచేత ప్రాజ్ఞుల కేకొందరికో అర్థం అవుతాయి. సర్వజనులకు వేదచోదితములైన ధర్మాలు తెలియడానికి ఈ పురాణేతిహాసాలు పుట్టుకొచ్చినవి. సోదాహరణంగా, రమ్యంగా, అద్భుతంగా ఈ ధర్మాల వ్యాఖ్యానం ఉంటుంది పురాణేతిహాసాల్లో.

పురాణాలలో కొన్ని విష్ణుపారమ్యానికీ, కొన్ని శివపారమ్యానికీ అంకితమైనట్టివి. అయితే ఆయా పురాణాల్లో ఆయా అధిదైవతాల ప్రశస్తి నిరాకరణాదులు మనకు కనిపించినా, మొత్తానికి దైవభక్తికీ. ధర్మానురక్తికీ, ధర్మానుచరణానికీ

ఇవి ప్రమాణ గ్రంథాలుగా రూపొందుతూ వచ్చినవి.

పురాణేతిహాసాలతోపాటు, వీటి నీడల్లో నడిచిన మరికొన్ని పుస్తకాలున్నవి. పురాణాలు పద్దెనిమిది. ఉపపురాణాలు పద్దెనిమిది. ఇతిహాసాలు రెండు. ఇవికాక తమ కథలకు పురాణ ప్రశస్తి కలగాలనే ఆశయంతో వ్రాయబడిన పురాణ సంకాశములైన కొన్ని పుస్తకాలున్నవి. వాటిలో ముఖ్యంగా పేర్కొనదగినవి రెండు.

ఒకటి, క్రీ॥శ॥ ఒకటవ శతాబ్దిలో వచ్చిన బృహత్కథ (కథాసరిత్సాగరం). రెండు, ఈ శతాబ్దంలో మనకు సమకాలీకులైన మధిర సుబ్బన్న దీక్షితులు వ్రాసిన "కాశీమజిలీ కథలు".

మన ప్రాచీన ఆంధ్ర సాహిత్యంలో జైనమత ప్రభావంతో బసవపురాణం అన్నది కూడా ఒకటి వచ్చింది. ఇందులో వీరశైవమతాన్ని స్థాపించిన బసవేశ్వరుని జీవితగాథ, మరికొందరి శివభక్తుల జీవితకథలున్నవి.

ఈ రోజుల్లో పురాణం అనే మాట చమత్కారానికీ, పెద్ద గ్రంథానికీ, అభూతకల్పనకూ, అపఖ్యాతిపాలైన వ్యక్తి కథకూ పర్యాయవాచికగా ప్రజలూ, రచయితలూ వాడుకుంటున్నారు. అది వేరే విషయం – కాని "పురాణం" అనే మాటకు వ్యుత్పత్త్యర్థం ఎంతో రహస్యమయంగా ఉంది. ఎంతో విజ్ఞాన ప్రదంగా ఉంది. పురాణాల శాశ్వతత్వాన్ని ధ్వనిస్తున్నట్టుగా ఉంది. 'పాతదైనా కొత్తగా కనిపించేదీ' అని వ్యుత్పత్త్యర్థం. అంటే పురాణాల్లో పాతకథలే ఉంటాయి కాని కొత్తగా తోస్తాయి. కుచేలుడూ శ్రీకృష్ణుడూ చెలిమిచేసిన కథ, తన స్త్రీపట్ల అవమానకరంగా ప్రవర్తించినవాడి డొక్క చించి, తన పౌరుషాన్ని నిరూపించుకున్న రాముని కథ, దేవుణ్ణి ప్రకటించే తండ్రికి బుద్ధి చెప్పిన ప్రహ్లాదుని కథ, జ్ఞానానికీ కులానికీ సంబంధం లేదని చెప్పే ధర్మవ్యాధుని కథ, ఇంకా ఎన్నో కథలు ఇలాంటివి నేటికీ మనకు ఆదర్శంగా ఉన్నవి.

పురాణవాఙ్మయంతో పరిచయం భారతీయతాలక్షణం, జాతీయతాలక్షణం, విశిష్టవ్యక్తిత్వ లక్షణం, ఉత్తమ అద్వైత లక్షణం.

© SCERT not to be republished

## రచయిత పరిచయం



డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి

డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి గారు 1930లో మహబూబ్‌నగర్‌లో జన్మించారు. సంస్కృతాంధ్రాంగ్ల ఉర్దూ హిందీ భాషలలో చక్కని ప్రవేశం కలవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేశారు.

'యువభారతి' సాహిత్య సాంస్కృతిక సంస్థకు అధ్యక్షులుగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సంస్థల కార్యదర్శిగా, తెలంగాణా రచయితల సంఘ కార్యదర్శిగా పనిచేశారు. మహబూబ్‌నగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ గ్రంథాలయం ద్వారా హైదరాబాదు రాష్ట్ర విమోచనోద్యమంలో పాల్గొని జైలు శిక్షననుభవించారు.

తెలుగు – ఉత్తర భారత సాహిత్యాలు, చాటువులు, వాగ్భూషణమ్, వేగుచుక్కలు, వెలుగుబాటలు, అడుగు జాడలు, వెలుగు చూపే తెలుగు పద్యాలు, దేశమును ప్రేమించుమన్నా మొ॥వి వీరి రచనలు. "కవి సమయములు" వీరి సిద్ధాంత గ్రంథం. ఎన్నో కథానికలను, వచన కవితలను రాశారు. పఠనీయం శీర్షికలతో 39 ఉత్తమ గ్రంథాల పరిచయాలను రాశారు. 1989లో పరమపదించారు.

## ఇవి చేయండి

### I. వినడం - మాట్లాడడం

1. అనంతమైన వైవిధ్యం మనదేశంలో విలసిల్లడంలో ఉన్న అంతస్సూత్రం ఏమిటో చెప్పండి?
2. కింది వాటిలో ఏదైనా ఒకదాని గురించి ప్రసంగించండి.
   (అ) భారతీయ ఆత్మ
   (ఆ) యాత్రా దర్శనం ఆవశక్యత
   (ఇ) పురాణ ఇతిహాసాల పఠన ఆవశ్యకత
3. "ప్రాచీన సాహిత్యాధ్యయనం" అనే పాఠానికి తగినట్లుగా పాఠంలోని విషయం ఉందా? దీనిపై మీ అభిప్రాయాలను చెప్పండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

**1. పాఠాన్ని చదివి ఈ కింది వాక్యాలను పూర్తి చేయండి.**

(అ) తన ఇంట్లో ..................................................................................

.......................................................................... భక్తితో నమస్కరిస్తాడు.

(ఆ) భారతదేశ భౌగోళిక సౌందర్యం ..........................................................

..........................................................................................

.......................................................................... నిక్షిప్తములై ఉన్నవి.

(ఇ) ఇవి సంస్కృతంలో ......................................................................

.......................................................................... చూపనక్కర లేదు.

(4) గాంధీ మహాత్ముడు ....................................................................

.......................................................................... ప్రకటించాడు.

(5) నిన్నటి తరంలో ........................................................................

.......................................................................... తెలియ వచ్చేది.

(6) పురాణేతిహాసాలలో మన గత ..........................................................

.......................................................................... కన్నీరు ఉంది.

**2. కింది గద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

సాహిత్యం అనే మాటకు అర్థం తెలుసుకుందాం. హితాన్ని / మేలును చెప్పేదే సాహిత్యం. ఏది మంచో ఏది చెడో చెప్పి ప్రజల్ని మంచి మార్గంలో నడిపించేదే సాహిత్యం. వేదాలు ప్రజల్ని 'ఇలా చేయి' అని

© SCERT not to be republished

శాసిస్తాయి. సత్యం వద! ధర్మం చర! అంటే సత్యాన్నే పలుకు! ధర్మాన్నే ఆచరించు!ఇలా నిర్దేశిస్తూ చెప్తాయి వేదాలు. పురాణాలు, ఇతిహాసాలలో ఉండే కథలు కూడా మంచినే చెప్తాయి. ఇవి మనకు మంచి మిత్రుడిలా సలహా ఇస్తాయి. కావ్యాలు కూడా సున్నితంగా మన మనసుకు ఎక్కేటట్లుగా మంచిని బోధిస్తాయి. వేదపురాణేతిహాసాలు. కావ్య నాటకాదులు అన్నీ భిన్న సాహిత్య ప్రక్రియలు.

**ప్రశ్నలు**

(అ) పై పేరా ప్రధానంగా ఏ విషయం గురించి చెబుతున్నది?

............................................................................................

(ఆ) సాహిత్యం చదవడం వల్ల ప్రయోజనం ఏమిటి?

............................................................................................

(ఇ) ప్రజల్ని శాసించేవి ఏవి?

............................................................................................

(ఈ) మంచి మిత్రుడిలా మనకు సహాయపడేవి ఏవి?

............................................................................................

(ఉ) ఇంతవరకు మీరు తెలుసుకున్న విభిన్న సాహితీ ప్రక్రియలను పేర్కొనండి.

............................................................................................

**3. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా సమాధానాలు రాయండి.**

(అ) ఆసేతుహిమాచలం భారతదేశం వైవిధ్యంగా ఉన్నా ఏకత్వాన్ని సాధించడం ఎలా సాధ్యమయిందో రాయండి.

(ఆ) రామాయణ భారతాది ఇతిహాసాలు మానవాళికి ఏమి అందిస్తున్నాయో తెలపండి.

(ఇ) సంస్కృత భాష పరిచయం లేనివారు మహాకవుల రచనలను ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు?

(ఈ) దేశభక్తికి, పురాణేతిహాస పఠనానికి గల సంబంధాన్ని తెలియజేయండి.

(ఉ) ఆర్ష ధర్మాన్ని బోధించే గ్రంథాలు ఏవి? అవి ఏం బోధిస్తున్నాయో తెలపండి.

(ఊ) వాల్మీకి, వ్యాసుడు తమ రచనల ద్వారా మానవులకు అందించిన సందేశం ఏమిటి?

(ఋ) భారత ప్రాచీన సాహిత్య పరిచయం నేటి తరానికి ఎందుకు అవసరమో తెలియజేయండి.

## III. స్వీయ రచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

(అ) రాజగోపాలాచార్యులు “భారతాత్మను అర్థం చేసుకోవాలంటే రామాయణ భారతాలను చదివి తీరాల్సిందే” అని సందేశమిచ్చారు కదా! మీ అభిప్రాయం తెలియజేయండి.

© SCERT not to be republished

(ఆ) "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అంటూ శ్రీరాముడన్న దాన్ని గురించి మీ అభిప్రాయాన్ని తెలియజేయండి.

(ఇ) దేశాన్ని ప్రేమించేవాడికి అధికారం లభిస్తే దేశం వెలుగుబాటలో పయనిస్తుందన్న రచయిత అభిప్రాయాన్ని మీరు ఎలా సమర్థిస్తారు?

(ఈ) యాత్రలవల్ల దేశాన్ని చూడవచ్చు. తరించవచ్చు. విజ్ఞానాన్ని సంపాదించవచ్చు అని రచయిత చెప్పారు. యాత్రలవల్ల ఇంకా ఇతర ప్రయోజనాలు ఏమున్నాయో తెలియజేయండి.

(ఉ) రసానుభూతికి, ధర్మనిరతికి, సమైక్య జీవితానికీ మార్గదర్శకమైన సంప్రదాయం క్రమంగా నశించిపోతున్నది. ఇందుకు గల కారణాలను ఊహించి లేదా తెలుసుకొని రాయండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాల్లో జవాబులు రాయండి.**

(అ) ప్రాచీన సాహిత్య పఠనం ఆవశ్యకతను మీ సొంతమాటల్లో వ్యక్తంచేయండి.

(ఆ) "దేశభక్తి ప్రతి పౌరుడికీ అవసరం. దేశాన్ని ప్రేమించేవాడు అవినీతిపరుడు కాజాలడు. దురహంకారి కాజాలడు". రచయిత చెప్పిన ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తూ దేశభక్తులవల్ల దేశప్రజలకు కలిగే ప్రయోజనాలు ఏవో ఆలోచించి, తెలుసుకొని రాయండి.

(ఇ) రామాయణ, భారతాల్లోని మీకు తెలిసిన అంశాలను గురించి ప్రస్తావించండి. అవి సంస్కృతి పరిరక్షణకు ఎలా తోడ్పడ్డాయో వివరించండి.

## IV. పదజాలం

**1. కింది వాక్యాల్లో గీత గీసిన పదాల అర్థాలను పదవిజ్ఞానం ఆధారంగా రాయండి.**

(అ) ఆ సేతుశీతాచలం వ్యాపించి ఉన్న భారతదేశం అతిప్రాచీనమైంది. (          )

(ఆ) వైజయంతిక లీ మహాకావ్యాలు. (          )

(ఇ) మహానుభావులు తూష్ణీం భావాన్ని ఎవరి పట్లా చూపరు. (          )

(ఈ) పురాణేతిహాసాలు భారతీయ సంస్కృతిలో ఒక భాగం. (          )

(ఉ) కాలక్షేప ప్రసంగాలు సకృతు గా ఉండాలి. (          )

**2. కింది జాతీయాలను వాటి సమానార్థకాలతో జత చేయండి. ఈ జాతీయాలు ఉపయోగిస్తూ వాక్యాలను రాయండి.**

| జాతీయాలు | | సమానార్థకాలు |
|---|---|---|
| అ) కబంధ హస్తాలు | (   ) | (1) సర్వం కాలిపోవడం, ధ్వంసమవడం. |
| ఆ) చుప్పనాతి బుద్ధి | (   ) | (2) ప్రశస్తమైన వంట. |
| ఇ) పరశురామ ప్రీతి | (   ) | (3) ఓర్వలేనితనం. |

© SCERT not to be republished

ఈ). విశ్వామిత్ర సృష్టి ( ) (4) విడిపించుకోవడానికి వీలులేని దుర్మార్గపు పట్టు.

ఉ) భగీరథ ప్రయత్నం ( ) (5) శూన్యం, కనిపించనిది.

ఊ) చిదంబర రహస్యం ( ) (6) నూతన సృష్టి.

ఋ) నలభీమపాకం ( ) (7) కచ్చితమైన తీక్షణమైన శపథం.

ౠ) భీష్మ ప్రతిజ్ఞ ( ) (8) తీవ్రమైన ప్రయత్నం.

ఉదా – మనిషికి ఉండకూడని లక్షణాలలో చుప్పనాతి బుద్ధి ఒకటి.

## V. సృజనాత్మకత

మీ పాఠశాలలో జరిగే భాషోత్సవాలకు ప్రముఖ భాషావేత్త ముఖ్య అతిథిగా వచ్చారు. సాహిత్యానికి సంబంధించిన కొన్ని విషయాలను తెలుసుకోవాలని ఆయన్ను ఇంటర్వ్యూ చేసే అవకాశం మీకు కలిగింది. ఆయన్ని ఇంటర్వ్యూ చేయండి.

ప్రశ్న – నమస్కారమండీ! మీరు ఈ రోజు మా పాఠశాలకు రావడం మాకు ఆనందంగా ఉంది.

జ.........................................................................................

ప్రశ్న – భాష గొప్పదనాన్ని మేము వేటి ఆధారంగా తెలుసుకోవాలి?

జ.........................................................................................

ప్రశ్న –

జ.........................................................................................

ప్రశ్న –

జ.........................................................................................

## VI. ప్రశంస

మన దేశం ఎన్నో భాషలకు, సంస్కృతులకు, సంప్రదాయాలకు నిలయం. అయినా మనమంతా భారతీయులం అనే ఆత్మీయ భావనతో కలసిమెలసి జీవిస్తున్నాం కదా! ఈ విషయాన్ని ప్రశంసిస్తూ ఉపన్యాసానికి తగిన సమాచారాన్ని సేకరించుకొని ఒక వ్యాసం రాయండి.

## VII. భాషను గురించి తెలుసుకొందాం

### 1. క్త్వార్థం

భాషాభాగాల్లో ఒకటైన 'క్రియ'ను గురించి కింది తరగతుల్లో తెలుసుకున్నారు. క్రియలను బట్టి వచ్చే వాక్య భేదాలను కొన్నింటిని చూద్దాం.

**కింది వాక్యం చదవండి.**

భాస్కర్ ఆటలు ఆడి, అలసిపోయి, ఇంటికి వచ్చాడు.

భాస్కర్ – కర్త

© SCERT not to be republished

వచ్చాడు – కర్తృ వాచక పదానికి చెందిన ప్రధాన క్రియ.

ఆడి, అలసి – కర్తృ వాచక పదానికి చెందిన ఇతర క్రియలు.

ఆడి, అలసిపోయి అనే పదాలు క్రియలే కానీ, వాటితో పూర్తిభావం తెలియడం లేదు.

'ఆడి' అనే క్రియకు 'ఆడి' తర్వాత ఏం చేశాడు? అనే ప్రశ్న ఉదయిస్తోంది.

పూర్తి అర్థాన్ని ఇవ్వడం లేదు. ఇంకా, జరిగిపోయిన విషయాన్ని అంటే భూతకాలంలోని పనిని సూచిస్తుంది.

'అలసిపోయి' అనే క్రియ కూడా అలాంటిదే.

వీటిని భూతకాలిక అసమాపక క్రియలని, క్త్వార్థం అనీ అంటారు.

ఈ క్రియలన్నీ కూడా 'ఇ' కారంతో అంతమవుతాయి. అంటే చివర '–ఇ' అనే ప్రత్యయం చేరిన క్రియారూపం క్త్వార్థక క్రియ అన్నమాట.

కొన్ని ఉదాహరణలు చూడండి. కింది వాక్యాల్లోని క్త్వార్థక క్రియలను గుర్తించండి.

1. రాముడు లంకకు వెళ్ళి, రావణునితో యుద్ధం చేసి, జయించి, సీతను తీసుకొని అయోధ్యకు వచ్చాడు.
2. పుష్ప అన్నం తిని, నిద్రపోయింది.

## 2. శత్రర్థం

కింది వాక్యం చదవండి.

"అఖిలేశ్ మధుకర్‌తో మాట్లాడుతూ నడుస్తున్నాడు".

ఈ వాక్యంలో –

'నడుస్తున్నాడు' అనే ప్రధాన క్రియకు 'మాట్లాడుతూ' అనే ఉపక్రియ వర్తమాన కాలంలో ఉండి అసమాపక క్రియను సూచిస్తున్నది.

ఈ విధంగా,

'మాట్లాడు' అనే ధాతువుకు '–తూ' అనే ప్రత్యయం చేరుతున్నది. ఇలా చేరడం వల్ల, వర్తమాన అసమాపక క్రియగా మారుతున్నది. వర్తమాన అసమాపక క్రియను శత్రర్థం' అంటారు.

కింది వాక్యాలు చదవండి. వీటిలో 'శత్రర్థం' పదాల కింద గీత గీయండి.

(అ) జ్యోతిర్మయి కంప్యూటర్‌లో ఏదో చదువుతూ ముఖ్యాంశాలు రాసుకుంది.

(ఆ) సౌజన్య పడుతూ, లేస్తూ సైకిల్ తొక్కడం నేర్చుకుంటూన్నది.

(ఇ) మాధవి ఆలోచిస్తూ పుస్తకం చదువుతున్నది.

(ఈ) ఫల్గుణ్ పేపరు చదువుతూ టీ.వి చూస్తున్నాడు.

(ఉ) సలీమా పాడుతూ నాట్యం చేస్తున్నది.

పైన తెలిపిన విధంగా మరికొన్ని వాక్యాలు రాయండి.



© SCERT not to be republished

### 3. చేదర్థం

కింది వాక్యం చదవండి.

"కష్టపడి పని చేస్తే ఫలితం దానంతటదే వస్తుంది".

కింది ప్రశ్నకున్న జవాబు గురించి ఆలోచించండి.

ప్ర॥ ఫలితం దానంతటదే ఎప్పుడు వస్తుంది?

జ. కష్టపడి పనిచేస్తే.

పై సంశ్లిష్ట వాక్యంలో ప్రధాన క్రియ "వస్తుంది". ఇది ఫలితాన్ని సూచిస్తుంది.

ఈ ఫలితం రావాలంటే షరతును విధించడానికి చేర్చే అసమాపక క్రియ "చేస్తే". ఇది కారణం, అది కార్యం.

ఈ విధంగా సంశ్లిష్ట వాక్యాల్లో ప్రధాన క్రియ సూచించే పని జరగటానికి షరతును సూచించే క్రియను 'చేదర్థం' అంటారు. చేత్ అర్థాన్ని ఇచ్చేది చేదర్థకం. వీటిలో ధాతువుకు "తే/ఇతే" అనే ప్రత్యయాలు చేరుతాయి.

కింది వాక్యాలు పరిశీలించండి. చేదర్థం పదాల కింద గీత గీయండి.

(అ) మొక్కలు నాటితే అవి పర్యావరణానికి మేలు చేస్తాయి.

(ఆ) జీవ వైవిధ్యాన్ని కాపాడితే ప్రకృతి సమతులితమవుతుంది.

(ఇ) మంచి పుస్తకాలు చదివితే అజ్ఞానం తొలగుతుంది.

**ప్రాజెక్టు పని**

మనం చదవాల్సిన ముఖ్యమైన పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, నాటకాలు, కథలు-వాటిపేర్లు తెలుసుకొని రాయండి. మీ పాఠంలో, గ్రంథాలయంలో వాటిలో ఏవేమి ఉన్నాయి? లేని వాటి గురించి మీ భాషోపాధ్యాయుల ద్వారా తెలుసుకొని, ప్రధానోపాధ్యాయులకు నివేదిక సమర్పించండి.

**నేనివి చేయగలనా ?**

| | |
|---|---|
| 1. ఇచ్చిన అంశం గురించి ప్రసంగించగలను. | ఔను / కాదు |
| 2. విషయం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను / కాదు |
| 3. సాహిత్యాధ్యయనం గురించి సొంత మాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. ఇంటర్వ్యూ సంభాషణలను ఊహించి రాయగలను. | ఔను / కాదు |

సరయిన సమయంలో సరయిన రీతిలో స్పందించడమే చైతన్యం.

© SCERT not to be republished